## హయత్‌నగర్ సిఐ గా శంకరయ్య

**దశ, హైదరాబాద్:** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ పలాస నాగరాజును బదిలీ చేస్తూ కమిషనర్ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం సీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ శంకరయ్యను హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు జోయాలుక్కాస్ స్కూల్ బ్యాగుల పంపిణీ



**దశ, ఓయూ:** విద్యార్థుల విద్యావసరాలకు తోడ్పాటునందిస్తూ జోయాలుక్కాస్ హబ్సిగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (MPPS) విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలలోని 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు చదువుతున్న 100 మంది విద్యార్థులకు ఈ బ్యాగులను అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రతి బ్యాగులో ఒక గొడుగు, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్ మరియు పెన్సిల్ బాక్స్ వంటి వస్తువులను ఉంచారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ చైతన్య మేడం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్. విజయ్ కుమార్, జెడ్పీహెచ్ఎస్ హబ్సిగూడ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఉపేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు బ్యాగులను అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. సుజాత, ఎ. కల్యాణి, చ. అనిత, కె. శ్రీదేవి మరియు కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజా సమస్యలపై పృథ్వీ చౌదరి వినతి

❖ *ఎకో పార్కు ఏర్పాటుపై TPCC ప్రధాన కార్యదర్శి పృథ్వీ చౌదరి*



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ సిటీలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ గుర్రంగూడ ఫారెస్ట్‌లో వన మహోత్సవాన్ని గురువారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు 424 ఎకరాలలో ఎకో పార్కు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పృథ్వీ చౌదరి పలు సమస్యలపై సీఎంకు వివరించారు. ఏకో పార్కు ఏర్పాటుపై నియోజకవర్గ ప్రజల తరఫున సీఎంకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకవెళ్లాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పృథ్వీ చౌదరికి సూచించారు.

## గుండాల ప్రభుత్వ ఆసుపత్రి లో గర్భిణీ మరణం దురదృష్టకరం


❖ *బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి*

❖ *బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు*



**దశ, గుండాల:** గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గర్భిణీ మహిళ పనజ మరణించిన ఘటన అత్యంత విషాదకరమని మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు . ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గర్భిణీ మహిళ ప్రాణం కోల్పోవడం వెనుక ఉన్న కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదా వైద్య సేవల్లో లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించి న్యాయం చేయాలని రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఒక కుటుంబానికి తీరని లోటును మిగిల్చిన ఈ ఘటన పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా ఆరోగ్య శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా.. ముగ్గురు అరెస్ట్



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ ముఠాను రాచకొండ పోలీసులు ఛేదించారు. ఎల్‌బీ నగర్ ఎస్‌వోటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి 51.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.25.90 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. జూన్ 17న తారా కన్వెన్షన్ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, వెనుక సీటు కింద దాచిన గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. విచారణలో నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడైంది. ఘట్‌కేసర్‌లో సరఫరా చేసేందుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి బొలెరో వాహనం, మూడు మొబైల్ ఫోన్లు, రూ.2,290 నగదును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన కొనుగోలుదారు సాగర్‌తో పాటు ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# వీరాపురం ఇసుక రీచ్, పోడు భూముల సమస్యలపై మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన ఆదివాసీ నాయకులు





**దశ,పినపాక:** గిరిజనులకు సంబంధించిన పలు కీలక సమస్యలపై తుడుం దెబ్బ నాయకులు మంత్రి సీతక్క,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తి రాజు, జాతీయ ఉపాధ్యక్షుడు కోడెం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించి ప్రస్తుతం రెండు గిరిజన సహకార సంఘాల మధ్య కొనసాగుతున్న వివాదాన్ని నిష్పాక్షికంగా పరిష్కరించాలని కోరారు. రెండు ఆదివాసీ సంఘాలకు సమన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పోడు భూముల సమస్యలు, గిరిజనుల జీవనోపాధి, ఏజెన్సీ ప్రాంతాల్లో వలసల ప్రభావం తదితర అంశాలను మంత్రి, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో శ్రీగిరి లక్ష్మి ఇసుక క్వారీ ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు కూడా పాల్గొని వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించిన తమ సమస్యలను వివరించారు. గిరిజన హక్కులు, జీవనోపాధి, పోడు భూముల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారని గిరిజన నాయకులు తెలిపారు.

## భారీ డ్రగ్స్ దాడులు – 34 లక్షల విలువైన APIలు స్వాధీనం





**దశ, మేడ్చల్ :** డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA), తెలంగాణ అధికారులు మెద్చల్‌మల్కాజిగిరి జిల్లా గౌడవెల్లిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రిడియెంట్స్ (APIs) గోదాంను గుర్తించారు. ఈ దాడిలో సుమారు రూ.34 లక్షల విలువైన API నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా ఔషధ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### మరో ఘటనలో అక్రమ మెడికల్ షాపుపై దాడి

నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారం గ్రామంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు నిర్వహించిన తనిఖీలలో డ్రగ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాపును గుర్తించారు. ఆ దుకాణంలో విక్రయానికి నిల్వ ఉంచిన రూ.55 వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా ఔషధాల విక్రయం జరపడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ ఔషధ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు హెచ్చరించారు.

## సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం.. గన్‌పార్క్ వద్ద అరెస్టులు




**దశ, హైదరాబాద్:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, పెండింగ్ బిల్లుల చెల్లింపు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు తదితర డిమాండ్ల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. గన్‌పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఉచిత బీమా, పెన్షన్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, కుడితాడు బాపురావు, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కోకన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం. రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, గండీటి నర్సింహా, గోపాల్, మధు, పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, దూమర్ల బాస్కర్, అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మల్లేశం, గడ్డమీది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలకు SIR పై అవగాహన కార్యక్రమం



**దశ, పినపాక:** మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) పై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) పాల్గొన్నారు. సమావేశంలో ఎన్నికల స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ అనూష, స్పెషల్ ఇన్‌స్పెక్టర్ పరమయ్య పాల్గొని SIR ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై సమగ్ర అవగాహన కల్పించారు. ఓటరు జాబితా తయారీలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ బీఎల్‌ఓలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక డిప్యూటీ తాసిల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, వివిధ శాఖల అధికారులు, బిఎల్వోలు, రాజకీయ వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



**దశ,అశ్వారావుపేట:** మండలంలోని జమ్మిగూడెం గ్రామంలో మద్దిన బుచ్చిరాజు మహాలక్ష్మి దంపతుల కుమార్తె వైష్ణవి పుష్పాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి వైష్ణవిని ఆశీర్వదించిన తాటి వెంకటేశ్వర్లు, ఆమెకు నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి విద్య, ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడిన ఆయన, ఇలాంటి శుభకార్యాలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. చిన్నారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాని చంద్రమోహన్, డాక్టర్ భూక్య ప్రసాద్, అశ్వారావుపేట టౌన్ అధ్యక్షుడు సంపూర్ణ, జమ్మిగూడెం మాజీ సర్పంచ్ కొండయ్య, నక్క సూరిబాబు, మిందున వెంకటేష్, తోటా వెంకటస్వామి, జగపతి, ఆరేపల్లి గోవింద్, మాటూరి మోహన్, రాజనాల గంగాధర్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి : సర్పంచ్ పీ. సురేందర్

**దశ, బూర్గంపాడు:** పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని సందేళ్ళ రామాపురం గ్రామ సర్పంచ్ పీ. సురేందర్ పిలుపునిచ్చారు. గురువారం సందేళ్ళ రామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. మాన్‌సింగ్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల బోధన, అభ్యాస ప్రక్రియ సక్రమంగా కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సమర్థవంతంగా వినియోగించుకొని మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శిరీషాబాయి, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం 19-06-2026
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




# నక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

- నిర్ణీత గడువులో సర్వే, నమోదు ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశం
- వర్షాకాల సన్నద్ధతలో భాగంగా వరద ప్రభావిత, ముంపు ప్రాంతాల పరిశీలన



**దశ, మణుగూరు :** భూముల రీసర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్ష కార్యక్రమంలో భాగంగా మణుగూరు మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఆర్.ఓ.ఆర్. (రికార్డ్ ఆఫ్ రైట్స్) నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వర్షాకాల సన్నద్ధతలో భాగంగా గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.

మణుగూరు మండలం కొమ్ముగూడెం గ్రామంలో మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఆర్.ఓ.ఆర్. నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఎంట్రీ నమోదు చేయడానికి పడుతున్న సమయం, నమోదు చేస్తున్న వివరాల స్వరూపం, ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నక్ష పైలట్ ప్రాజెక్టు ద్వారా భూ రికార్డుల సమగ్రత, పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు భూములకు సంబంధించిన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సర్వే, నమోదు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి మణుగూరు మండలం అన్నారం, కమలాపురం గ్రామాల్లో గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే కోడిపుంజుల వాగు బ్రిడ్జి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి నీటిమట్టం పెరిగిన సమయంలో కోడిపుంజుల వాగు ద్వారా ఎదురు నీరు ప్రవహించడం వల్ల ఏర్పడే ముంపు పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వరదల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ప్రజల తరలింపు ఏర్పాట్లు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, ఇతర అత్యవసర సదుపాయాల కల్పనపై అధికారులని అడిగి తెలుసుకున్నారు . అనంతరం మణుగూరు సింగరేణి పి కే ఓ సి ఓపెన్ కాస్ట్ గనుల ప్రాంతం నుంచి విడుదలయ్యే నీటి ప్రభావంతో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.గాంధీనగర్‌లోని ఓపెన్ కాస్ట్ గనుల నుండి నీరు విడుదల చేసే ప్రదేశం నుంచి సుందరయ్య నగర్, కాళీమాత ఆలయ పరిసర ప్రాంతాలు, వినాయక నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

డ్రైనేజీల్లో పూడిక, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని, వర్షపు నీరు వేగంగా వెళ్లే విధంగా కాలువలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... వరదల ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు సిద్ధంగా ఉంచాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వాతావరణ హెచ్చరికలు, నీటిమట్టాల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటన లో కలెక్టర్ వెంట మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

- 80 కేజీల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్న పోలీసులు




**దశ, మణుగూరు:** మండలం తోగ్గుడెం వద్ద పోలీస్ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భద్రాచలం నుండి ఒరిస్సాకు స్కార్పియో వాహనంలో 80 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న మణుగూరు పోలీసులు వారి వద్ద నుండి 80 కేజీల గంజాయితో పాటు స్కార్పియో ను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురు రాజస్థాన్ కు చెందిన సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్ లుగా తెలిపారు..కేసు నమోదు చేసి రిమెండ్ కు తరలిస్తున్నట్లు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో మణుగూరు సిఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్, ఎస్సై రవుఫ్ లు, హెడ్ కానిస్టేబుల్ దామోదర్, కానిస్టేబుల్ మురారి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్తు

- మండల విద్యాశాఖ అధికారి నాగయ్య



**దశ, పినపాక:** ప్రభుత్వ పాఠశాల విద్య తోనే విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరం నాగయ్య తెలిపారు. మంగళవారం వివిధ ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందిస్తున్నామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా వ్యవస్థ రూపొందించుకుందని అన్నారు. 2025 26 సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 75వ వన మహోత్సవంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ,మణుగూరు:** అటవీ శాఖ ఆధ్వర్యంలో మణుగూరు మండలంలోని హనుమాన్ టెంపుల్ రథంగుట్ట ప్రాంతంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,,, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం, వన మహోత్సవం వంటి కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. చెట్ల పెంపకం ద్వారా వర్షపాతం పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన అటవీ శాఖ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రటరీ పాలమూరు రాజు, జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, తోగ్గుడెం సర్పంచ్ మడకం కృష్ణ, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఎస్. గణేష్ రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ్మిశెట్టి సాంబ, బత్తుల శ్రీను, కార్యకర్తలు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసి ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే పోలీస్ శాఖ లక్ష్యం

- డీఎస్పీ అరుణ్ కుమార్

**దశ, దుమ్ముగూడెం :** ఆదివాసి ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం పోలీస్ శాఖ లక్ష్యంగా పనిచేస్తుందని భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని దద్దమడుగు, గోత్తి కొయ్య గుంపు, కొత్తపెల్లి గ్రామాలలో, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి అరుణ్ కుమార్ మాట్లాడుతూ,,,, ఆదివాసి ప్రజలు మూఢనమ్మకాలు నమ్మవద్దని, ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా పోలీస్ శాఖను సంప్రదించాలని సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాలకు గ్రామస్తులు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్పయ్య, ఎస్సై జగన్మోహన్ చారి సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే పాయం



**దశ, మణుగూరు :** బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామానికి చెందిన రెంటాల వీరస్వామికి మంజూరైన రూ.44 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,,, ప్రజలు ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు .ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి,ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లకు లబ్ధిదారుడు రెంటాల వీరస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# అధికారిక ఇసుక ర్యాంపుల నుంచే సరఫరా జరగాలి

*భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ.*



**దశ బూర్గంపాడు:** సొసైటీ సభ్యులు అధికారికంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలని, మైనింగ్ అధికారులు , సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా గోదావరి ఇసుకను తరలించడం గానీ, ఇష్టానుసారంగా ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసి నిల్వలు చేయడం గానీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హెచ్చరించారు. గురువారం ఉదయం సారపాక పరిధిలోని తాళ్లగొమ్మూరు గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇసుక నిల్వలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో మాట్లాడిన ఆయన, సోంపల్లి అధికారిక ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు, అలాగే అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతోనే ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

అధికారికంగా సొసైటీ నిర్వహించే ఇసుక ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలని, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు గోదావరి ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతాల్లో కంచెలు లేదా కందకాలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే గోదావరి కరకట్ట ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది 24 గంటలపాటు నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను నిరోధించాలని సూచించారు. సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా అనధికారికంగా ఇసుక తరలించే వాహనాలను వెంటనే సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భవిష్యత్తులో కూడా ఎప్పటికప్పుడు ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని పేర్కొన్న ఆయన, అధికారిక ర్యాంపులు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు నిబంధనలకు లోబడి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీటీ సమ్మయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసిన అశ్వాపురం సీఐ సిలివేరు ఎల్లయ్య

**దశ, మణుగూరు :** అశ్వాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) గా బాధ్యతలు స్వీకరించిన సిలివేరు ఎల్లయ్య మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ను మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన బాధ్యతలు చేపట్టిన సీఐ సిలివేరు ఎల్లయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## నూతన సీఐ స్వాగతం పలికిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**దశ, అశ్వాపురం:** మండల బిఆర్ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో అశ్వాపురం సీఐగా నూతన బాధ్యతలు చేపట్టిన సిలివేరు ఎల్లయ్య గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువా తో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,,, అశ్వాపురం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీఐ ఎల్లయ్య సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. అనంతరం సీఐ ఎల్లయ్య కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం,ఈదర సత్యనారాయణ,నేలపట్ల సత్యనారాయణ రెడ్డి,మండల యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ,తూము రాఘవులు,చుంచు రామ్మూర్తి,గొర్రెముచ్చు వెంకటరమణ,దావా వీరాస్వామి,కళ్యాణపురం సర్పంచ్ లకావత్ రామారావు,మల్లెలమడుగు ఉపసర్పంచ్ గాడిద మహేష్,తదితరు నాయకులు పాల్గొన్నారు.